క్లుప్తంగా

నేడు తహసీల్దార్ కార్యాలయంలో స్పందన

చిత్తూరు రూరల్: నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మురళీమోహన్ తెలిపారు. ఉదయం 10.30 గంటలకు స్పందన ప్రారంభమవుతుందన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని ఆయన పేర్కొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

పూతలపట్టు: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం చెన్నై శంకర నేత్రాలయ ఆస్పత్రి ద్వారా ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. చికిత్సనంతరం కంటి సమస్యలున్న రోగులను ఉచితంగా చెన్నైలోని శంకరనేత్రాలయ ఆస్పత్రికి తీసుకెళ్లి, శస్త్ర చికిత్స, ఉచిత మందులు, భోజన వసతులను కల్పించి తిరిగి మండల కేంద్రంలో వదిలిపెట్టనున్నట్లు వివరించారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆధార్‌కార్డు సమర్పించాలి

గుడిపాల: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(సింగిల్‌విండో)లో ఓటుహక్కు కలిగిన వారందరూ ఆధార్‌కార్డు సమర్పించాలని సింగిల్‌విండో చైర్మన్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ గుడిపాల సింగిల్ విండోలో సభ్యత్వం తీసుకున్న రైతులు ఆధార్‌కార్డును సమర్పించాలన్నారు. జీరో ఖాతా తెరిచేందుకు ఈ ఆధార్ కార్డు, ఓటర్లు సమర్పించాల్సి ఉందని చెప్పారు. ఇందులో రూపే డెబిట్ కార్డ్‌తో పాటు రూ.2లక్షల ప్రమాద బీమా ఉంటుందన్నారు.

బీజేపీ మండలాధ్యక్షుడిగా రవి

యాదమరి: మండల బీజేపీ అధ్యక్షుడిగా రవిని జిల్లా పార్టీ అధ్యక్షులు జగదీశ్వర్ నాయుడు ప్రకటించారు. ఆదివారం చిత్తూరు పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్షులు, ఉపాధ్యక్షులు చంద్రమోహన్ ఆధ్వర్యంలో మండలంలోని కొటాలకు చెందిన రవిని ఎంపిక చేశారు.

బ్రహ్మ జ్ఞాన బోధన

బంగారుపాళెం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం బ్రహ్మ జ్ఞాన బోధన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కుప్పాలపల్లె బ్రహ్మర్షి పత్రీజీ పిరమిడ్ ధ్యాన ఆశ్రమం ఆధ్వర్యంలో ఉదయం 11 నుంచి 12.30 గంటల వరకు బ్రహ్మ బోధన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

చిత్తూరు కలెక్టరేట్ : సీపీఎస్‌ను రద్దు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అసోయేట్ అధ్యక్షులు గంటా మోహన్ అన్నారు. నగరంలోని ఏపీ కాంట్రిబ్యూటరీ పెన్షన్‌స్కీం ఎంప్లాయిస్ అసోషియేషన్ కార్యాలయంలో ఆదివారం ఆత్మగౌరవ సభ నిర్వహించారు. ఈ సభలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీసీపీఎస్‌ఈఏ అధ్యక్షులు సమీర్, రాష్ట్ర నాయకులు అప్పలరాజు, నాగేశ్వరరావు, సీఎం.దాస్, నరసింహులు, లోకేష్, నోబుల్ పాల్గొన్నారు.

నేడు వై ఏపీ నీడ్స్ జగన్

తవణంపల్లె: మండలంలోని పల్లె చెరువు సచివాలయంలో సోమవారం 'ఏపీకి జగనే ఎందుకు కావాలి' అనే కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు హరిరెడ్డి తెలిపారు. సంక్షేమ పథకాల బోర్డు, కిట్లు పంపిణీ, వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరణ ఉంటుందని వివరించారు. దీనికి అధికారులు, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఇరువారంపల్లెలో

ఐరాల: మండలంలోని ఇరువారంపల్లె సచివాలయంలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం మ ధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది హాజరుకావాలని కోరారు.

మాధవరంలో

యాదమరి: మండలంలోని మాధవరంలో సోమవా రం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించనున్న ట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి తెలిపారు. మాధవరం సచివాలయ పరిధిలో నిర్వహించే ఈ కార్యక్రమానికి జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి, ఎంపీపీ సురేష్ హాజరు కానున్నట్లు వివరించా రు. దీనికి మండలంలోని వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరుకావాలని కోరారు.

కూర్మాయిపల్లెలో

బంగారుపాళెం: మండలంలోని కూర్మాయిపల్లె గ్రామ సచివాలయంలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీపీ అమరావతి, ఇన్‌చార్జి ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

గ్రంథాలయం.. విజ్ఞాన భాండాగారం

- నేటితో గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు
- విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు
- 1953లో చిత్తూరులో తొలి గ్రంథాలయం





చిత్తూరులో ఏర్పాటు చేసిన తొలి గ్రంథాలయం, చిత్తూరులోని జిల్లా కేంద్ర గ్రంథాలయ కార్యాలయం , పలమనేరు గ్రంథాలయంలో పుస్తక పఠనంపై అవగాహన కల్పిస్తున్న గ్రంథాలయాధికారి

చిత్తూరు కార్పొరేషన్: 'చిరిగిన దుస్తులు అయినా తొడుక్కో.. కానీ మంచి పుస్తకం కొనుక్కో' అన్నది పెద్దల మాట. పుస్తకాల పఠనంతో జ్ఞానం మెరుగుపడుతుంది. గతంలో స్వాతంత్ర్య పోరాటానికి ఉద్యమ కార్యాచరణకు ఈ గ్రంథాలయాలు వేదికలుగా నిలిచి ఎంతో మందిని విప్లవమార్గంలో నడిపించాయి. దేశానికి స్వాతంత్ర్యం రావడంతో కీలక పాత్ర పోషించాయి. అనంతర కాలంలో సమాజానికి మంచి నేస్తాలుగా పనిచేశాయి. అక్షరాస్యత తక్కువగా ఉన్న నాటి కాలంలో ప్రజల్లో విలువలు తెలుపుతూ వారిలో పఠనాసక్తిని పెంచుతూ ఎంతో మందిని విద్యావంతులుగా తీర్చదిద్దడంలో గ్రంథాలయాల పాత్ర చెప్పుకోదగ్గది. ప్రస్తుతం గ్రంథాలయాలకు వెళ్లే వారి సంఖ్య తగ్గుతున్నా వాటి ప్రాధాన్యత తగ్గలేదు. నేటి కాలంలో గ్రంథాలయాలు తమ ఉనికిని చాటుకుంటూ మారిన కాలానికి తగ్గట్టుగా సేవలను మార్చుకుంటూ వస్తున్నాయి. నేడు విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలు కలిగిన విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దడంలోనూ, ఉద్యోగార్థులకు విజయాలను అందించే జ్ఞాన దీపికలుగా ఉపయోగపడుతున్నాయి. మంగళవారం నుంచి ప్రారంభమైన జిల్లా గ్రంథాలయ వారోత్సవాలు నేటితో ముగియనున్నాయి.

వారం రోజుల కార్యక్రమాలు

గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా వారం పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 14న ప్రారంభోత్సవాలతో పాటు బాలల హక్కుల దినోత్సవాలు నిర్వహించారు. 15న ఆయా గ్రంథాలయాల్లో పుస్తక ప్రదర్శనలు, మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమాలు, పుస్తక పఠనం ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాలు కల్పించారు. 16న గ్రంథాలయోద్యమానికి విశేషంగా కృషి చేసిన వారి స్మరణ, 17న రచయితల సందేశాలు, వివిధ అంశాల పై సదస్సులు, కవి సమ్మేళనాలు నిర్వహించారు. 18న విద్యార్థులకు వక్తృత్వం, చిత్రలేఖనం, వ్యాసరచన, క్విజ్, క్రీడా పోటీలు నిర్వహించారు. 19న దిశచట్టం, మహిళా సాధికారతపై చర్చా కార్యక్రమాలు నిర్వహించి, అవగాహన కల్పించారు. 20న డిజిటల్ గ్రంథాలయాల వినియోగంపై ఓరియంటేషన్ కార్యక్రమం, స్వీయ పఠన కార్యక్రమం అనంతరం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారు.

జిల్లా గ్రంథాలయ సమాచారం

జిల్లాలో కేంద్ర గ్రంథాలయం 1, శాఖా గ్రంథాలయాలు 71, పుస్తక నిక్షిప్త కేంద్రాలు 105 ఉండగా 71,470 మంది సభ్యత్వం కలిగి ఉన్నారు. ఏటా 13,16,866 మంది సందర్శిస్తున్నారు. 1.62 లక్షల మంది పుస్తకాలు ఇంటికి తీసుకొని వెళుతున్నారు. రోజు దాదాపు 3607 మంది పాఠకులు సందర్శిస్తున్నారు. నామమాత్రపు రుసుం రూ.10తో గంటసేపు ఇంటర్‌నెట్ అందిస్తున్నారు.

నిధులు మంజూరు

గ్రంథాలయ వారోత్సవాలు విజయవంతంగా నిర్వహించడానికి జిల్లా గ్రంథాలయ సంస్థ నిధులు మంజూరు చేసింది. జిల్లా కేంద్ర గ్రంథాలయానికి రూ.35 వేలు, ప్రధాన మున్సిపాలిటీల ఉన్న ప్రథమ శ్రేణి గ్రంథాలయాలకు రూ.15 వేలు చొప్పున, మున్సిపాలిటీల్లో ఉన్న ద్వితీయ శ్రేణి గ్రంథాలయాలకు రూ.11 వేలు చొప్పున నిధులు మంజూరు చేశారు. వీటితోపాటు మున్సిపాలిటీల్లో లేని ద్వితీయ శ్రేణి గ్రంథాలయాలకు రూ.8 వేలు చొప్పున మొత్తం రూ.6,04,56,768 మంజూరు చేశారు. వీటితో ఆహ్వానపత్రాలు ముద్రించుకోవడం, ఫ్లెక్సీలు, బ్యానర్లకు వినియోగించడం, మైక్ సెట్టు, ఫొటోలకు, వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులుగా ఇచ్చే పుస్తకాలకు ఖర్చు చేయాలి.

చిత్తూరులో తొలి గ్రంథాలయం

చిత్తూరు నగరంలో 1953లో ఆర్డీఓ కార్యాలయం పక్కన జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని 420 మంది సభ్యులు, 1020 పుస్తకాలతో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రోడ్డు విస్తరణలో భాగంగా భవనం సగం వరకు తొలగించారు. పత్రికలు, పుస్తకాలు ఇక్కడే పెట్టి జిల్లా గ్రంథాలయ కార్యాలయాన్ని స్థానిక మిట్టూరుకు మార్పు చేశారు. గంటకు రూ.10 చెల్లించి ఇక్కడ ఇంటర్‌నెట్‌ను వినియోగించుకునే సదుపాయం కల్పించారు. ప్రస్తుతం ఇక్కడ 45,383 పుస్తకాలు ఉండగా మొత్తం 10,342 మందికి సభ్యత్వం ఉంది. రోజుకు 16 దినపత్రికలు వస్తుండగా, వార, మాస పత్రికలు 44 వస్తున్నాయి. నిత్యం 105 మంది పాఠకులు వస్తుండగా 15 మంది పుస్తకాలను ఇంటికి తీసుకెళుతున్నారు. నూతన భవన నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.3.2 కోట్లు నిధులు మంజూరు చేసింది.

కంది పంటలో సస్యరక్షణతో అధిక దిగుబడి



దిగువ మోదలపల్లె వద్ద ఏపుగా పెరిగిన కంది పంట

తవణంపల్లె: కంది పంటలోల సస్యరక్షణ చర్యలు చేపడితే అధికదిగుబడి సాధించవచ్చు. ఖరీఫ్ సీజన్‌లో పండించే వర్షాధార పంటల్లో కంది ప్రధానమైనది. దీనిని వేరుశనగలో అంతరపంటగా, మిశ్రమ పంటగానూ సాగు చేస్తారు. ప్రస్తుతం మండలంలో 370 ఎకరాల్లో కంది పంట సాగవుతోంది. ప్రభుత్వం రైతులకు సబ్సిడీతో 16.8 క్వింటాళ్ల ఎల్‌ఆర్‌జి రకం కంది విత్తనాలను పంపిణీ చేసింది. ఇటీవల కురిసిన వర్షాలకు కంది పంట ఏపుగా పెరిగి కళకళలాడుతోంది. ప్రస్తుతం పూత, పిందె దశలో ఉంది. రైతులు సరైన యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడి వస్తుంది. ఎందుకంటే మంచుకాలం మొదలైనందున పూత కుళ్లిపోయే అవకాశం ఉంది.

చీడ పీడల బెడద ఎక్కువ

కంది పంట ప్రస్తుతం పూత, పిందె దశలో ఉండడంతో చీడ, పీడలు ఆశించే అవకాశం ఉంది. ముఖ్యంగా కాయతొలుచు పురుగులు, ఆకు చుట్టు పురుగులు, మారుకా మచ్చల పురుగులు, కాయ ఈగలు, ఎండు తెగుళ్ల బెడద ఉంటుంది. వీటి నివారణకు తగు యాజమాన్య పద్ధతులు పాటిస్తే పంటను కాపా డువచ్చును. ఎలాంటి చర్యలు చేపట్టాలో వ్యవసాయాధికారి ప్రవీణ్ వివరించారు.

పురుగు నివారణ చర్యలు

- కంది పంటను ఆశించే పురుగులను గుర్తించాలి.
- కాయ తొలుచు పురుగు నివారణకు లీటరు నీటిలో 5 ఎంఎల్ వేపనూనె కలిపి పంటకు పిచికారి చేయాలి.
- మొగ్గ దశలో పురుగు సోకితే లీటరు నీటిలో క్లోరిఫైరిఫాస్ మందు 2.5 ఎంఎల్ పిచికారీ చేయాలి.
- పూత, పిందె దశలో పురుగు నివారణకు క్వినాల్‌ఫాస్ మందును పిచికారి చేయాలి.

చురుగ్గా ఎక్స్‌ప్రెస్ హైవే పనులు



189 కొత్తపల్లె వద్ద జరుగుతున్న వంతెన నిర్మాణం

గుడిపాల: మండలం మీదుగా వెళుతున్న బెంగళూరు–చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు పనులు ప్రస్తుతం చురుగ్గా సాగుతున్నాయి. సమారు 258 కిలోమీటర్ల మేర జరిగే ఈ రోడ్డు పనుల్లో వందలాదిమంది కార్మికులు పనిచేస్తున్నారు. బెంగళూరు నుంచి తమిళనాడు శ్రీపెరంబుదూరుకు కలుపుతూ రోడ్డు పనులు చేపట్టారు. మండలంలోని దాయంవారి పల్లె నుంచి 189 కొత్తపల్లె, వసంతాపురం, కుప్పిగానిపల్లె, చలిదీమలపల్లె మీదుగా తమిళనాడుకు వెళుతుంది. స్తంభాలను నిర్మించి వాటిపై దిమ్మెలను ఏర్పాటు చేస్తున్నారు. కొన్నిచోట్ల బ్రిడ్జి వర్కులు దాదాపు పూర్తయ్యాయి. పూర్తయిన చోట తారురోడ్డు వేయడం వంటి పనులను వేగంగా చేస్తున్నారు.

సంక్షేమ పథకాల బుక్‌లెట్లు పంపిణీ



సంక్షేమ పథకాల బుక్‌లెట్లను అందజేస్తున్న జనార్దన్

గుడిపాల: సంక్షేమ పథకాలకు సంబంధించి బుక్‌లెట్లను ఆదివారం ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, 197 రామాపురం సర్పంచ్ జనార్దన్ ఆధ్వర్యంలో వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లలో ఒక్కో కుటుంబానికి ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాల ద్వారా ఎంత లబ్ధి చేకూరింది అన్న విషయాలను తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు సీఎం కావాలి? కుటుంబానికి ఎంత లబ్ధిపొందింది అన్న విషయాలను ఇంటింటికీ వెళ్లి తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్రమణ్యం, వరదరాజులు, గృహసారథులు కోకిల, దాము, సరళ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతకు జన్మదిన శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలుపుతున్న మండల నాయకులు

పూతలపట్టు: అభయసాయి సంస్థ అధినేత, వైఎస్సార్‌సీపీ నాయకులు లోకేష్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఆదివారం ముత్తిరేవులలోని ఆయన నివాసంలో మండల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పేదలకు, గ్రామాలకు ఉచితంగా వాటర్ ప్లాంట్లు, గృహాలను నిర్మిస్తున్న ఆయనకు మంచి ఆరోగ్యాలను ప్రసాదించాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యురాలు దేవిక, బైటపల్లి సర్పంచ్ రామతులసి, బాలాజీ, ఆకనంబట్టు సర్పంచ్ మణి, షణ్ముగం, నాగరాజు, రాంమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు ఫారాల నిశిత పరిశీలన



చిత్తూరు నగరంలో ఓటర్లతో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: ఓటరు నమోదు, తొలగింపు, సవరణల కోసం అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలించాలని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ బీఎల్‌వోలను ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలోని 150 పోలింగ్ కేంద్రాల పరిధిలో జరుగుతున్న దరఖాస్తు పరిశీలన కార్యక్రమాన్ని ఆదివారం కమిషనర్ అరుణ ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఎంజీఆర్ వీధి, మిట్టూరు, శాంతినగర్ తదితర ప్రాంతాల పరిధిలో కమిషనర్ ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. బీఎల్వోల వద్దనున్న ఫారం 6, 7, 8 దరఖాస్తులు, ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి, ప్రజలతో నేరుగా మాట్లాడారు. కమిషనర్ మాట్లాడుతూ ముసాయిదా ఓటర్ల జాబితా సవరణ–2024 కార్యక్రమం డిసెంబర్ 9వ తేదీ వరకు ఉంటుందని చెప్పారు. ఈ సమయంలో కొత్తగా ఓటు హక్కు నమోదుతోపాటు, తొలగించడం, మార్పులు చేర్పులకు అవకాశం ఉన్నట్లు వివరించారు. ఇదే విషయాన్ని బీఎల్వోలు పోలింగ్ కేంద్రం స్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. దరఖాస్తులతోపాటు అందిన ధ్రువీకరణ పత్రాలను క్షేత్రస్థాయిలో ప్రత్యక్ష పరిశీలన ద్వారా తనిఖీ చేయాలన్నారు. అన్ని సక్రమంగా ఉంటే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. వచ్చే నెల 2, 3 తేదీల్లో నిర్వహించనున్న ప్రత్యేక ఓటర్ల నమోదు అవగాహన కార్యక్రమంపై పోలింగ్ కేంద్రాల స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. కమిషనర్ వెంట మెప్మా సీఎంఎం గోపి, బీఎల్వోలు ఉన్నారు.

సకాలంలో అప్లోడ్ చేయాలి

బూత్ లెవల్ అధికారులు (బీఎల్వోలు) స్వీకరించిన ఓటరు నమోదు, సవరణలు, తొలగింపు దరఖాస్తులను క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం సకాలంలో లాగిన్‌లో అప్‌లోడ్ చేయాలని ఈఆర్‌ఓ, ఆర్డీవో చిన్నయ్య, ఏఈఆర్వో కమిషనర్ అరుణ ఆదేశించారు. ఆదివారం మునిసిపల్ కార్యాలయం నుంచి బీఎల్వోలు, సూపర్‌వైజర్ అధికారులతో వీడియో సమావేశం ద్వారా సమీక్ష నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ బీఎల్వోలు ఇప్పటివరకు స్వీకరించిన ఫారం–6, 7 మరియు 8 దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పక్కాగా విచారించాలన్నారు. దరఖాస్తులు అప్లోడ్ ప్రక్రియలో ఎలాంటి పొరబాట్లకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో కార్యాలయ మేనేజర్ ఉమామహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నివాళి



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి నానమ్మ నారాయణమ్మ (90) ఆదివారం మరణించారు. కొంగారెడ్డిపల్లెలోని డిప్యూటీ మేయర్ నివాసంలో పార్థివదేహానికి మేయర్ అముద, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఆర్టీసీ వైస్‌చైర్మన్ విజయానందరెడ్డి, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, నగర పార్టీ అధ్యక్షులు జ్ఞానజగదీష్, కార్పొరేటర్లు నివాళి అర్పించారు. రాజేష్ తండ్రి పద్మనాభరెడ్డికి ధైర్యం చెప్పారు.

అక్రమ రవాణాకు అడ్డాగా యాదమరి

యాదమరి: తమిళనాడు సరిహద్దులో ఉన్న మండలం అక్రమ రవాణాకు అడ్డాగా మారింది. చెక్‌పోస్టులు లేకపోవడంతో మండలం మీదుగా గ్రానైట్, మట్టి అక్రమంగా తరలిపోతోంది. రాత్రి వేళలో పోలీసులు, ఆర్టీఓ అధికారులు పట్టించుకోక పోవడంతో యాదమరి మీదుగా తమిళనాడుకు యథేచ్ఛగా రవాణా చేస్తున్నారు. దీంతో పాటు మందుబాబుల ఆగడాలు పెరిగిపోతున్నాయి. ప్రయాణికులపై దాడులకు పూనుకుంటున్నారు. మండల కేంద్రంలో నిత్యం ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది.

– తమిళనాడు సరిహద్దులో సారా కాచి విక్రయించే వారి సంఖ్య ఎక్కువే. నాటుసారా తయారీపై పోలీసులకు సమాచారం ఇచ్చిన వ్యక్తిపై ముసుగువేసి దాడి చేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే స్టేషన్‌కు ఎస్‌ఐ లేకపోవడంతో ఇలాంటి ఫిర్యాదులను పట్టించుకునేవారు లేరు.

– పోలీసు స్టేషన్‌లో ఉండాల్సిన ఎస్‌ఐతోపాటు సిబ్బంది ఖాళీలు సగం కంటే ఎక్కువగా ఉండడంతో కర్ణాటక మద్యం విచ్చలవిడిగా రవాణా అవుతోంది. ఇలాంటి మద్యాన్ని గత వారంలో రెండు సార్లు చిత్తూరు ఎక్సైజ్ అధికారులు సీజ్ చేసి, పోలీసులకు అప్పగించారు.

– మండల కేంద్రంలో ఎక్కడ పడితే అక్కడ రోడ్డుపైనే, నీవానది ఒడ్డుపైన వ్యక్తి మద్యం తాగి బ్రిడ్జిపై నుంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది సరిపడా లేకపోవడం, శాంతి భద్రతల పరిరక్షణలో కీలకంగా వ్యవహరించే ఎస్‌ఐ లేకపోవడంతో ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

అసలు సిబ్బందే లేరు

యాదమరి పోలీసు స్టేషన్‌లో ఉన్న ఎస్‌ఐ సుమన్ గత వారంలో బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో ఎవ్వరినీ నియమించలేదు. ఇద్దరు ఏఎస్‌ఐలు ఉండగా వారిలో ఒకరిని హైవే మొబైల్‌కు అటాచ్ చేశారు. హెడ్ కానిస్టేబుళ్లు ఏడుగురు ఉండగా ఒకరు ఎస్‌ఐ జీబుకు డ్రైవర్‌గాను, ఐటీ కోర్‌కు ఇద్దరు వెళ్లగా, రాత్రి విధులకు ఒకరు, మెడికల్ లీవ్‌లో ఒకరు వెళ్లడంతో మిగిలిన ఇద్దరు విధులకు హాజరవుతున్నారు. కానిస్టేబుళ్లు 18 మంది ఉండగా వారిలో 11 మంది మాత్రమే విధుల్లో ఉన్నారు. అందులో కోర్టు, ఇతరత్రా డ్యూటీలకు వెళ్లగా నలుగురు మాత్రమే స్టేషన్‌లో ఉన్నారు. వారిలో ఇద్దరు పగలు, ఇద్దరు రాత్రి వేళలో విధులు నిర్వహిస్తున్నారు. దీంతో అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ఉన్నతాధికారులు స్పందించిన వెంటనే పోలీసుస్టేషన్‌కు ఎస్‌ఐతోపాటు సరిపడా సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.




యాదమరి మెయిన్ బజారులో రహదారిలోనే ఆపేసిన మినీ లారీలు, రాత్రి వేళ తమిళనాడుకు తరలిపోతున్న గ్రానైట్

ఇందిరా సేవలు మరువలేనివి



సన్మానం అందుకున్న మహిళలు

పూతలపట్టు: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ సేవలు మరువలేనివని మండల గ్రంథాలయ అధికారి రవీంద్రబాబు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో ఇందిరాగాంధీ జయంతి నిర్వహించారు. ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు, పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో ముందుండారని తెలిపారు. అనంతరం మహిళలను సన్మానించారు. ఉపాధ్యాయులు నాదముని పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ జయంతి వేడుకలు



నివాళులర్పిస్తున్న మహిళా నాయకులు

పూతలపట్టు: మండలంలోని యం.బండపల్లి బస్టాండ్ కూడలిలోని ఇందిరాగాంధీ విగ్రహానికి కాంగ్రెస్ మహిళా నాయకురాలు రాణి యాదవ్ పూలమాలలను వేసి నివాళులర్పించారు. రాణి యాదవ్ మాట్లాడుతూ ఇందిరాగాంధీ సుదీర్ఘ మహిళా ప్రధానిగా దేశాన్ని పాలించిన ఏకైక వ్యక్తి ఇందిరాగాంధీ అని కొనియాడారు. అనంతరం పండ్లు అందరికీ పంచి పెట్టారు.

పంట నూర్పిళ్లతో రైతన్నలు బిజీ బిజీ!

పలమనేరు: జిల్లాలోని పడమటి మండలాల్లో గతంలో ఏటా తీరని వర్షాభావ పరిస్థితులే వెంటాడేవి. కానీ నాలుగేళ్లుగా వరుణుడి కరుణతో మంచి వర్షాలు కురుస్తున్నాయి. గత వేసవిలో నారుపోసిన వరిమడులకు ఇప్పుడు కోతలు, నూర్పిడులు సాగుతున్నాయి. రైతులంతా పొలం పనులతో బిజీ బిజీగా ఉన్నారు. వ్యవసాయ కూలీలకు చేతినిండా పని లభిస్తోంది. తమిళనాడు రాష్ట్రం నుంచి ఇక్కడికి చేరుకున్న నూర్పిడి యంత్రాలకు డిమాండ్ వచ్చింది. ఈ పర్యాయం డివిజన్‌లో 900 హెక్టార్లలో వరి సాగైంది. ఈ ప్రాంతంలో వరికోతలు మొదలవడంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. కూలీలు లభించక రైతులు పొరుగు గ్రామాలకు ఆటోలను పంపి మరీ కూలీలను పనులు రప్పించుకుంటున్నారు. దీంతో ముందుగానే అడ్వాన్స్ ఇస్తున్నట్టు కొందరు రైతులు చెప్పారు. రైతులు పంటకోత, నూర్పిడులు చేసేందుకు గుత్తలకు ఒప్పిస్తున్నారు. ఎకరా పొలంలో వరికోతకు గుత్త రూ.8 వేల నుంచి రూ.10వేల వరకు కుదుర్చుకుంటున్నారు. అయినప్పటికీ కూలీలకు డిమాండ్ ఏమాత్రం తగ్గడం లేదు.